https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 351 బుధవారం 1-4-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా? అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను... మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

## హోర్ముజ్‌ను వదిలేసి..
# యుద్ధం ఆపేస్తే?

ముందుగా అనుకున్నట్టుగా నాలుగైదు వారాల్లో పూర్తవని యుద్ధం

హోర్ముజ్‌ను తెరవడానికి క్లిష్టమైన,భారీ ఆపరేషన్ చేపట్టాల్సిన పరిస్థితి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యోచన



**వాషింగ్టన్, మార్చి 31:** యుద్ధం సుదీర్ఘంగా కొనసాగుతుండటంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అసహనంతో ఉన్నారా? హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు క్లిష్టమైన, భారీ స్థాయి దాడులు తప్పవని, దానితో యుద్ధం సుదీర్ఘకాలం చేయాల్సి వస్తుందని భావిస్తున్నారా? ఈ క్రమంలో హోర్ముజ్ పరిస్థితిని అలాగే వదిలేసి, యుద్ధాన్ని నిలిపివేయాలని భావిస్తున్నారా?.. ప్రస్తుతం ట్రంప్ ఇదే ఆలోచనలో ఉన్నారని అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ట్రంప్ సహాయకులు, ఉన్నతాధికారులను ఉటంకిస్తూ, కొన్ని రోజులుగా ట్రంప్ చేస్తు న్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఈ మేరకు కథనం ప్ర చురించింది. ఆ కథనం ప్రకారం.. ఇరాన్‌పై యుద్ధం నాలుగు నుంచి ఆరు వారాల్లో ముగుస్తుందని ట్రంప్ భావించారు. యుద్ధం మొదలై నాలుగు వారాలు దాటింది. ఇప్పట్లో ముగిసే పరిస్థితి కనబడటం లేదు. హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు ప్రయత్నిస్తే ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయి. మరింత కాలం యుద్ధాన్ని కొనసాగించక తప్పని పరిస్థితి నెలకొంటుంది. దానికితోడు హోర్ముజ్‌ను తె రిచేందుకు బలగాలతో సాయంగా రావాలని ట్రంప్ ఎన్నిసార్లు కోరినా నాటో దేశాల నుంచి సానుకూల స్పందన రావడం లేదు. దీనిపై ట్రంప్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. హోర్ముజ్ జలసంధి మూసి ఉండటం వల్ల అమెరికాకు నేరుగా జరిగే నష్టమేమీ లేదని భావిస్తున్నారు.

# అన్నదాత ఆగమాగం

గాలివానతో వాలిన వరి,

మొక్కజొన్న.. నేలరాలిన మామిడి

తడిసిన పసుపు, పొద్దుతిరుగుడు పంటలు

కన్నీటిపర్యంతమవుతున్న రైతులు

పలుచోట్ల తీగలపై విరిగిపడ్డ చెట్ల కొమ్మలు

విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం

జగిత్యాల, మంచిర్యాల, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో వేల ఎకరాల్లో పంట నష్టం

నష్టంపై జిల్లాలవారీ ప్రాథమిక అంచనాలు



**హైద్రాబాద్, మార్చి 31 :** అకాలవర్షం యాసంగి పంటలను దెబ్బతీసి రైతులను ఆగమాగం చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. గింజ గట్టిపడే దశలో నవనవలాడుతున్న వరిపంట వాలిపోయింది. కంకుల దశకొచ్చి నిటారుగా ఉన్న మొక్కజొన్న పంట కూడా గాలివాన ఉధృతికి నేలపై తివాచీ పరిచినట్లుగా ఒడిగిపోయింది. టెంకదశలో ఉన్న మామిడి రాలిపోవడంతో భారీ మొత్తంతో తోటలను కొనుకున్న రైతులైతే లబోదిబోమంటున్నారు. విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. చెట్లు, కొమ్మలు విరిగి తీగలపై పడ్డాయి. ఫలితంగా అనేకచోట్ల విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి తదితర మార్కెట్ యార్డుల్లో అమ్మకానికి తెచ్చిన మక్కలు, పసుపు పంటలు తడిసిపోయాయి. మిరప పంటకూ భారీగానే నష్టం జరిగింది. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 6,155 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతింది. 1,200 ఎకరాల్లో వరి, 1,400 ఎకరాల్లో మొక్కజొన్న, 550 ఎకరాల్లో నువ్వుల పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలో 40చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్తు లైన్లు దెబ్బతిన్నాయి. కథలాపూర్ మండలం తక్కలపల్లిలో 11 కేవీ విద్యుత్తు స్తంభాలు నేల కూలాయి. వెల్గటూరు మండలం బీరుసాని గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వంట గదిపై చెట్టు విరిగిపడింది. భీమారం, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో చెట్టు కొమ్మలు రోడ్డుపై విరిగిపడ్డాయి. సిరిసిల్ల జిల్లాలో మొక్కజొన్న, మామిడి పంటలతో పాటు కల్లాల వద్ద ఆరబోసిన పొద్దుతిరుగుడు గింజలు తడిసిపోయాయి. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట, కుర్తిలింగంపల్లి గ్రామాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. జిల్లాలోని పలు మండలాల్లో వరి గింజలు నేలరాలాయి. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని పారువెళ్ల, మాదాపూర్‌లో మొక్కజొన్న పంట నేలవాలింది. మామిడికాయలు రాలిపోయాయి. పెద్దపల్లి జిల్లాలో 2,231 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అంతర్గాం, ధర్మారం, ఓదెల, పాలకుర్తి, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లోని 55 గ్రామాల్లో 410 ఎకరాల్లో వరి పంట, 1,757 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. మంచిర్యాల జిల్లాలో 2,143 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 1,792 ఎకరాల్లో మొక్కజొన్న, 351 ఎకరాల్లో వరి పంటకు నష్టం కలిగింది. గాలులతో కొన్నిచోట్ల విద్యుత్తు స్థంభాలు కూలాయి. జైపూర్, నెన్నెల, భీమారం, చెన్నూర్‌లో మామిడి కాయలు నేలరాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

# చట్టబద్ధం.. కట్టుదిట్టం!

## ఏపీ రాజధానిపై చట్టబద్ధమైన స్పష్టత.. నేడే లోక్‌సభలో 'అమరావతి' బిల్లు

రేపు రాజ్యసభలో ఆమోద ముద్ర!

రాష్ట్రపతి ఆమోదంతో 'నోటిఫికేషన్'!

అసెంబ్లీ తీర్మానం మేరకు కదిలిన కేంద్రం

2024 జూన్ 2 నుంచే రాజధానిగా 'అమరావతి'

రాజధాని పరిధిపైనా బిల్లులో స్పష్టత

సీఆర్డీయే నోటిపై చేసిన ప్రాంతమంతా రాజధానే



**న్యూఢిల్లీ, మార్చి 31 :** ఆంధ్రప్రదేశ్ రాజధాని 'అమరావతి'తో ఆటలు కుదరవిక! 'అమరావతే ఆంధ్రప్రదేశ్ రాజధాని' అనే చట్టబద్ధమైన స్పష్టత ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. 'రాష్ట్ర విభజన తర్వాత పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని. ఆ తర్వాత తెలంగాణకు హైదరాబాద్ రాజధానిగా కొనసాగుతుంది. మరి... ఆంధ్రప్రదేశ్ మాటేమిటి?' అనే ప్రశ్నకు... 'అమరావతి' అనే సమాధానం పార్లమెంటు వేదికగా వినిపించనుంది. 2024 జూన్ 2వ తేదీ నుంచే ఏపీ రాజధానిగా అమరావతిని గుర్తించేలా... ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు – 2026ను బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంగళవారం రూపొందించిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో ఈ బిల్లును చేర్చింది. బుధవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేదా హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ఈ బిల్లును ప్రవేశపెడతారు. బుధవారమే లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందే అవకాశముంది. ఆ తర్వాత... గురువారం రాజ్యసభలోనూ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పొందుతారు. ఆపై... రాష్ట్రపతి ఆమోద ముద్రతో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధమైన రక్షణ కల్పిస్తూ నోటిఫికేషన్ వెలువడనుంది. వైసీపీ అధికారంలోకి రాగానే అమరావతిని అటకెక్కించి, మూడు ముక్కలాటకు తెరలేపిన సంగతి తెలిసిందే. దీంతో... కూటమి ప్రభుత్వం అమరావతికి పార్లమెంటు ద్వారా చట్టబద్ధమైన రక్షణ, స్పష్టత కల్పించాలని భావించింది. దీనిపై అనేక ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. అసెంబ్లీ తీర్మానం ఆధారంగా పార్లమెంటులో చట్టం చేస్తే... అది మరింత బలంగా ఉంటుందని కేంద్రం సూచించడంతో శనివారం (మార్చి 28న) అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. అమరావతిపై తీర్మానాన్ని ఆమోదించింది. అప్పటికప్పుడు కేంద్రానికి పంపింది. ఆ మేరకు... బుధవారం ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం వెల్లడించింది.

**బిల్లులో ఏముందంటే..**

2014లో ఆమోదించిన విభజన చట్టంలోని సెక్షన్ 5, సబ్‌సెక్షన్ 2లో... 'ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఉంటుంది' అని పేర్కొన్నారు. ఇప్పుడు ఇక్కడ 'అమరావతి'ని చేర్చి... 'ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి నూతన రాజధానిగా ఉంటుంది' అని మార్చుతారు. అంటే... 'రాష్ట్ర విభజన అనంతరం పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. ఆ తర్వాత, ఆంధ్రప్రదేశ్‌కు అమరావతే రాజధాని' అనే స్పష్టత ఇవ్వను న్నారు. సవరణ బిల్లులో లక్ష్యాలు, కారణాలను (స్టేట్‌మెంట్ ఆఫ్ అబ్జెక్ట్స్ అండ్ రీజన్స్) స్పష్టంగా వివరించారు. "పునర్ వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం పదేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఉంటుందని నాటి చట్టంలో పేర్కొన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఏపీ ప్రభుత్వం తగిన పరిశీలన, సంప్రదింపుల అనంతరం అమరావతిని రాష్ట్ర రాజధానిగా గుర్తించి నోటిఫై చేసింది. ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధానిగా అమరావతి పేరును చేర్చుతూ సదరు చట్టంలోని సెక్షన్ 5ను సవరించాలని కేంద్రాన్ని కోరుతూ ఏపీ శాసనసభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

## ఆటో ఎల్‌పీజీ సరఫరాను
# పెంచండి

### కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రికి ఉత్తమ్ లేఖ



**హైదరాబాద్, మార్చి 31** వాహనాలకు ఎల్‌పీజీ గ్యాస్ సరఫరాలో ఏర్పడిన సంక్షోభాన్ని నివారించేందుకుగాను సరఫరాలను పెంచాలని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాశారు. గ్యాస్ కొరత కారణంగా రాష్ట్రంలో ఆటో రంగంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపారు. 'రాష్ట్రంలో సుమారు లక్ష ఎల్‌పీజీ ఆటో రిక్షాలు తిరుగుతున్నాయి. ఆటో ఎల్‌పీజీ గ్యాస్‌ను ప్రభుత్వ, ప్రైవేటు ఆపరేటర్లు వేర్వేరుగా అందిస్తున్నాయి. ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ వంటి పీఎ?సయూలు సమష్టిగా 33 అవుట్‌లెట్లను నిర్వహి స్తూ 20 శాతం వాటా కలిగి ఉండగా.. ప్రైవేటు ఆపరేటర్లు రాష్ట్రంలో 110 అవుట్‌లెట్లతో 80శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి' అని లేఖలో ఉత్తమ్ వివరించారు. ప్రస్తుతం నెలకొన్న సరఫరా పరిమితుల కారణంగా రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో వాటి అవుట్‌లెట్లన్నింటిలో కార్యకలాపాలకు ఇబ్బందులు తలెత్తాయని, వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ రంగ సంస్థల అవుట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ లభ్యతను పెంచాలని కోరారు. ప్రభుత్వరంగ అవుట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ ప్రస్తుత ధర లీటరుకు రూ.75 ఉండగా ప్రైవేటు కంపెనీలు లీటరుకు రూ.93 విక్రయిస్తున్నాయని, కొరతను ఆసరాగా చేసుకుని ఎక్కువ ధరకు విక్రయించే అవకాశం ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. ప్రజా రవాణా, ఆటో డ్రైవర్ల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## బీజేపీలో చేరిన టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్

**న్యూఢిల్లీ, మార్చి 31 :** పశ్చిమ బెంగాల్ ఎన్నికల వేళ భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్(52) బీజేపీలో మంగళవారం చేరారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సమక్షంలో పేస్ కాషాయ కండువా వేసుకున్నారు. ప్రధాని మోదీ నాయకత్వం, క్రీడల పట్ల ఆయనకు ఉన్న మక్కువ కారణంగానే తాను బీజేపీలో చేరానని పేస్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. బీజేపీలో చేరడమనేది దేశానికి ముఖ్యంగా యువతకు సేవ చేసేందుకు తనకు దక్కిన పెద్ద అవకాశమని పేర్కొన్నారు. బీజేపీలో చేరడాన్ని ఓ బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. రాబోయే 20–25 ఏళ్లల్లో ప్రభుత్వం స్పోర్ట్స్ సైన్స్, మెడిసన్, ఫిజియోథెరపీ, క్రీడా మౌలిక సదుపాయాలపై దృష్టిసారించాలని పేస్ సూచన చేశారు.

## 6న బాసరకు సీఎం రేవంత్



**బాసర, మార్చి 31** ఈనెల 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి నిర్మల్ జిల్లాలోని బాసర జ్ఞాన సరస్వతీ క్షేత్రానికి రానున్నారు. ఆలయ పునిర్నిర్మాణ పనులను ఆయన భూమి పూజ చేయనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు బాసరకు వచ్చారు. కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు.

# దిశా నిర్దేశం లేని అసెంబ్లీ సమావేశాలు



దిగ జారిన సభా నాయకుడి ప్రతిష్ఠ

పొంగులేటి అవినీతిపై ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్

బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్

**హైదరాబాద్, మార్చి 31** అసెంబ్లీ సమావేశాలు దిశా నిర్దేశం లేకుండానే ముగిశాయని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ నేత టీ హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీలపై స్పష్టత వస్తుందని ఆశలు పెట్టుకున్న ప్రజలకు సర్కారు నిరాశే మిగిల్చిందని మంగళవారం అసెంబ్లీ మీడియా హాలులో జరిగిన మీడియా సమావేశంలో చెప్పారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలకు జవాబివ్వకుండా తొండలు, కండల భాష మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. సభా నాయకుడికి ఉన్న ప్రతిష్ఠను దిగజార్చారన్నారు. కాంగ్రెస్ పాలకులు ఆత్మరక్షణలో పడ్డప్పుడల్లా విపక్షాలపై ఎదురు దాడి చేయడం తప్ప సభా మర్యాదను పాటించలేదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై చర్చకు సర్కారు ముందుకు రాలేదని, అసెంబ్లీ సమావేశాల్లో సగం రోజులు కూడా ప్రశ్నోత్తరాలు జరగలేదని చెప్పారు. ఇక ఢిల్లీ నుంచి సీఎం వస్తున్నారని.. ఏకంగా 4 గంటల టీ బ్రేక్ ఇచ్చారని, ఆర్థిక మంత్రి ప్రిపేర్ కావడానికి 3 గంటలు వేచి చూసేలా చేశారన్నారు. ఇంట్లో ప్రిపేర్ అయి రావాలే గానీ.. సభకు వచ్చాక ప్రిపేరవుతారా? అని ఆయన ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అవినీతిని సాక్ష్యాధారాలతో తాము సభలో బయటపెడితే ప్రజల దృష్టి మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేశారని ఆరోపించారు.

## బీజాపూర్‌లో 25 మంది మావోయిస్టుల లొంగుబాటు



**చర్ల, మార్చి 31** ఛత్తీస్‌గఢ్‌లో బీజాపూర్ జిల్లాలో మంగళవారం 25 మంది మావోయిస్టులు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ఎదుట లొంగిపోయారు. వీరంతా దండకాకరణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు. లొంగిపోయిన వారిలో12మంది మహిళలుండగా, వీరందరిపై కలిపి మొత్తం రూ.1.47 కోట్ల రివార్డు ఉంది. వీరి నుంచి 93 తుపాకులు, రూ.2.90కోట్ల నగదు, 7.20కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# పులిని బతకనివ్వండి!



రక్తం మరిగిన పులి.. క్రూరంగా ప్రవర్తిస్తున్న పులి.. మనుషుల వెంట పడుతున్న పులి.. పశువులను చంపుతున్న పులి.. ప్రమాదకారిగా మారిన పులి... ఇలా రకరకాల పదాలు మనకీమధ్య సోషల్ మీడియాలో బాగా వినిపిస్తున్నాయి. ఈ పదాల వెనక ఎంత వాస్తవం ఉంది? ఒక కుక్కను చంపాలనుకున్నప్పుడు దాన్ని పిచ్చిదని ముద్ర వేస్తే చంపడం సులభమవుతుంది. పెద్దపులి పరిస్థితి కూడా ఇలాగే తయారైంద నిపిస్తున్నది. వాటి ఆవాసాలు ధ్వంసమైపోయి అడివంటూ మిగలకపోయేసరికి దిక్కుతోచక వందల కిలోమీటర్లు నడిచి, తలదాచుకునే చోటు కోసం వెతుక్కుంటూ వస్తున్నాయి. తినడానికి తిండి లేక కాలే కడుపుతో అడవిని వెతుక్కుంటూ గ్రామాల వైపు నడిచి వస్తున్నాయి. వాటి ప్రయాణం మధ్యలో తగిలే జనావాసాలు, పంట పొలాలు, మానవ సంచారం... వాటిని మరింత ఆందోళనకు, భయానికి గురిచేస్తున్నాయి. మనిషి శాకాహారం తినగలిగి కూడా రోజూ కోట్ల కొద్దీ కోళ్లు, మేకలను తన ఆహారం కోసం హతమారుస్తున్నాడు. మాంసాహార జీవి అయిన పెద్దపులి మాత్రం ఏం చేస్తుంది?! ఆకలి తీర్చుకోవడానికి, తనకు ఎదురైన జంతువులను వేటాడుతున్నది. తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నది. మనిషి తనకు హఠాత్తుగా ఎదురుపడితేనో లేదా తనకు హాని చేయజూస్తేనో ఆత్మరక్షణార్థం ఎదురు దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నది. రోజురోజుకూ అటవీ విస్తీర్ణం తగ్గిపోతుంటే, అడవులన్నీ పోడుగా మారిపోతుంటే, వేటగాళ్లు అడవిలో ఉచ్చులు పెట్టి విచ్చలవిడిగా అటవీ ప్రాణుల్ని చంపి తింటుంటే పులులకు తినడానికి తిండి లేక సంచారం మొదలుపెట్టాయి. ఆహార పిరమిడ్‌లో పై భాగంలో పులి ఉంటుంది, అది బతికితేనే అడవి చల్లగా ఉంటుంది, అడవిలో సమతుల్యత ఉంటుంది... పర్యావరణం నిలబడుతుంది. అలాంటి అడవుల్ని రోజురోజుకూ ధ్వంసం చేస్తూ కొంత మంది ఆ భూముల్ని ఆక్రమిస్తుంటే ఒక మంత్రేమో, ఆ భూములకు పట్టాలిస్తాను అంటాడు! అటవీ శాఖ మంత్రేమో-- అడవులు నరక వద్దంటాడు. ఒకే ప్రభుత్వంలో ద్వంద్వ వైఖరి ఇది. మనం తరచూ చూస్తున్న చోద్యమే! మహారాష్ట్రలోని తడోబా, ముఖ్యంగా తిప్పేశ్వర్ అటవీ ప్రాంతాల వరకు మనం వెళ్లి చూడగలిగితే అక్కడ పెరుగుతున్న రిసార్టులతో పాటు గ్రామాలకు గ్రామాలే అడవిని ఆక్రమిస్తున్న వైనం మనకు కనిపిస్తుంది. తిప్పేశ్వర్ కేవలం 150 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న చిన్న అడవి. అక్కడ ఈ పెద్దపులులు తలదాచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. నానాటికీ కుంచించుకుపోతున్న అడవితో వాటికి నిలువనీడ లేక ప్రాదేశిక తగాదాలతో వాటిలో అవి పోరాటాలు చేసి, ఓడిన పులులు తాము తల దాచుకునే స్థలం కోసం వలసబాట పడుతున్నాయి. వందల కిలోమీటర్లు ప్రయాణించినా అవి బతకడానికి అడవంటూ మిగిలితే కదా! ఒక పులి 600 కిలోమీటర్లు ప్రయాణించి రాజమండ్రి పరిసరాలకు చేరుకున్న వైనం మీరు వినే ఉంటారు! సురక్షితంగా మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆ పులిని విశాఖ జూకు తరలించిన విషయం విని సంతోషించాను. ఎందుకంటే దాన్ని రక్తం మరిగిన పులి అనో.. ప్రమాదకారి అనో ముద్ర వేసి చంపలేదు. ఇప్పుడు పడుతున్న ఆందోళన అంతా జనగామ, సిద్దిపేట ప్రాంతాల్లో తిరుగుతున్న పులి గురించి. దానినే ఇష్టం వచ్చినట్టు సోషల్ మీడియాలో ప్రమాదకారి అని, రక్తం మరిగిన పులి అని రకరకాలుగా ఆకతాయితనంతో దుష్ప్రచారం చేస్తున్నారు. ఒకసారి ఆ పులిని ప్రమాదకారిగానో లేదా మనుషుల్ని తినేదిగానో ముద్ర వేస్తే దాని కథ ముగిసిపోయినట్టే! మత్తు తూటాతో నిద్రపుచ్చి పెద్దపులిని సంరక్షించాల్సిన చేతులే, దాన్ని పట్టుకోవడం మా వల్ల కాదు అని చేతులెత్తేస్తే... రేపు జరగబోయేది ఇదే! ఈ మధ్య మహారాష్ట్ర అసెంబ్లీలోనైతే ఒక మంత్రి- చిరుత పులి వేషంలో వచ్చి, 'అవి జన జీవనానికి ఆటంకం కలిగిస్తున్నాయి, వాటిని చంపేయండి' అని బహిరంగంగా అనడం ఆందోళనకరం. నిజంగా వాటిపై ఏదో ఒక ముద్ర వేసి చంపే హక్కు మనిషికి ఉందా? ఈ భూమిపై ప్రతి ప్రాణికి మనిషితో సమానంగా బతికే హక్కు ఉంది. కానీ మనిషి ఏదో ఒక ముద్ర వేసి వాటిని చంపజూడడం ఎంతవరకు న్యాయం? వాటి నోటికాడి కూడు లాగేసుకుంటూ వాటి ఆవాసాలను ధ్వంసం చేశాక ఆ అసహాయ జీవులు మాత్రం ఏం చేస్తాయి? వీధి కుక్కలు, కోతుల గురించి మాట్లాడే జంతు ప్రేమికుల గొంతు, పులి పట్ల ఎందుకు మూగబోయింది? కుక్కలు, కోతులు మాత్రమే జంతువులా? మనిషి వల్ల రోజూ అనేక రకాల జీవజాతులు శాశ్వతంగా కాలగర్భంలో కలిసిపోతున్నాయి. పులి ఠీవికి, రాజసానికి, అందమైన మేని ఛాయకు పెట్టింది పేరు. అన్నిటికంటే ముఖ్యంగా స్వేచ్ఛకు ప్రతీక. దానిని జూలలో సంరక్షణ పేరిట బంధించకండి. స్వేచ్ఛగా అడవులలో తిరగనివ్వండి. పులి అడుగుల సవ్వడి వినిపించని అడవులు శ్మశానంతో సమానం. ఆ అందమైన జంతువును బతకనివ్వండి. అడవిని సంరక్షించాలని, జంతువుల్ని రక్షించాలని కలలు కని ఫారెస్ట్ ఆఫీసర్లుగా మారిన నిజాయితీ గల అటవీశాఖ ఉద్యోగులకు ఆయుధాలు ఇవ్వండి, అడవుల విస్తీర్ణాన్ని కాపాడండి. కవ్వాల్, నల్లమల అడవుల్లో పులిగర్జన వినిపించనీయండి!!

# అసోంలో హిమంత హాలాహలం


సోషల్ మీడియా వివేక రాహిత్య ప్రమాణాల ప్రకారం చూసినా భారతీయ జనతా పార్టీ అసోం శాఖ ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసిన ఓ వీడియో నాగరిక విలువల మరింత భ్రష్టత్వానికి అద్దం పట్టింది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలోనే తొలగించివేసిన ఆ వీడియోలో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఇద్దరు వ్యక్తుల (ఒకరు చిన్న టోపీ ధరించిన వ్యక్తి కాగా మరొకరు నిండు గడ్డంతో ఉన్న వ్యక్తి)పై ఎయిర్ రైఫిల్‌ను పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో గురిపెట్టి ఉన్న దృశ్యం కనిపిస్తుంది. బంగ్లాదేశీ ముస్లిం వలసకారులకు వ్యతిరేకంగాను, అసోం ప్రజల అస్తిత్వాన్ని కాపాడడమే లక్ష్యంగా ఆ వీడియోను రూపొందించినట్టు చెబుతున్నారు. అయితే అందులోని హింసాత్మక మతతత్వ దృశ్యాలను గమనిస్తే అంతకంటే కక్షపూరిత ప్రవర్తన మరొకటి ఉండదని స్పష్టమవుతుంది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన నాయకుడు ముస్లింలపై తుపాకీ గురిపెట్టడమనేది రాజ్యాంగ బాధ్యతల ఉల్లంఘనకు ఒక భయంకర ఉదాహరణ. జిత్తులమారి నాయకుడు అయిన హిమంత అటువంటి వీడియో ఉన్న విషయం తన దృష్టికి రాలేదని అన్నారు. ఆయన వాదాన్ని అంగీకరించేవారు బహుశా ఎవరూ ఉండరు. బీజేపీ అసోం విభాగం స్వయంగా సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసిన వీడియో అది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆ వీడియోను తొలగించే సమయానికి దాన్ని పదిలక్షల మందికి పైగా వీక్షించారు. హిమంత రాజకీయ వైఖరులు తెలిసినవారు ఆ వీడియో గురించి ఆశ్చర్యపోరు. ఇప్పటికి చాలా నెలలుగా 'మియా' (అసోంలో బెంగాలీ మాట్లాడే ముస్లింల గురించి మొరటుగా ప్రస్తావించే పదమది)లకు వ్యతిరేకంగా జరుగుతున్న ఒక విషపూరిత ప్రచారానికి హిమంత నాయకత్వం వహిస్తున్నారు. ఆర్థిక కార్యకలాపాల నుంచి 'మియా'లను బహిష్కరించాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. దుకాణదారులు, కూరగాయల విక్రేతలు, ఆటో రిక్షా డ్రైవర్లు మొదలైన వారందరినీ ఆర్థిక జీవనం నుంచి బహిష్కరించాలని ఆయన నిక్కచ్చిగా చెబుతున్నారు. ఇటువంటి వైఖరిని అనుసరిస్తున్నందుకు ఆయనేమీ విచారం వ్యక్తం చేయలేదు. ఎటువంటి సంజాయిషీలు ఇవ్వలేదు. అసోం సాంస్కృతిక--నాగరికతా విలువలను సంరక్షించుకునేందుకు 'మియా'ల బహిష్కరణ తప్పనిసరి అని ఆయన గట్టిగా వాదిస్తున్నారు. ముస్లింలను నిందిస్తూ తాను నిరంతరమూ చేస్తోన్న వ్యాఖ్యలు, ప్రకటనలు మొదలైనవి ఎన్నికలలో లబ్ధి చేకూరుస్తాయని హిమంత విశ్వసిస్తున్నట్టుగా కనిపిస్తోంది. అధికార దుర్వినియోగంతో ముఖ్యమంత్రి, ఆయన కుటుంబమూ అపరిమితమైన ఆస్తులు సమకూర్చుకున్నారని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. హిమంత రెచ్చగొడుతున్న మతతత్వ భావోద్రేకాలు ఆ ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడమే కాకుండా, వారి మధ్య మతపరమైన విభేదాలనూ సృష్టిస్తున్నాయి. 'బయటి వ్యక్తి'పై ఆగ్రహం, అసహ్యం అసోం సామాజిక జీవన రంగాలలో దశాబ్దాల నుంచీ భాగంగా ఉంటూ వస్తోంది. తమ గడ్డపై తమ సంఖ్య తగ్గిపోతుండడం, బెంగాలీ భాష మాట్లాడేవారి సంఖ్య పెరిగిపోతూ, తమపై వారు ఆధిపత్యం చలాయించడాన్ని అస్సామీ భాష మాట్లాడే ప్రజలు సహజంగానే సహించలేకపోతున్నారు. వారి నిరసనలకు తననుతాను ఒక లౌడ్ స్పీకర్‌గా నిలుపుకోవడంలో హిమంత సఫలమయ్యారు. అసోం జనాభాలో ముస్లింలు 38 శాతం మంది ఉన్నారు. ఈ కారణంగా జనాభాపరమైన మార్పులు, అస్సామీ సంస్కృతి మనుగడకు ఎదురవుతున్న సవాళ్ల విషయమై నిజమైన, ఊహాత్మక భయాందోళనలను రెచ్చగొట్టడం చాలా సులువు. ఈ కారణంగానే సామాజిక మాధ్యమాలలో ప్రత్యక్షమైన ఆ విద్వేషపూరిత వీడియో సందేశం తీవ్ర స్థాయిలో సమస్యాత్మకమైంది. అసోం వెలుపల విద్వేష ప్రసంగంగా పరిగణన అవుతున్నది అసోంలో మాత్రం ఆ గడ్డ ప్రజల చారిత్రక, భాషాపరమైన, సాంస్కృతిక, ఆర్థిక హక్కులను కాపాడేందుకు ఉద్దేశించినది అవుతున్నది. ప్రస్తావిత వీడియో మైనారిటీలకు వ్యతిరేకంగా ఆగ్రహాన్ని రెచ్చగొట్టేదిగా కాకుండా నిత్య జీవితంలో రోజువారీ అనుభవాల ఆధారంగా ఏర్పడే రాజకీయ అవగాహనను ప్రతిబింబించేదిగా సమర్థనీయమవుతున్నది. 2002లో గుజరాత్ అల్లర్లను గుజరాతీ అస్మిత (ఆత్మగౌరవం)ను రక్షించేందుకు చెలరేగినవిగా అప్పటి ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ సమర్థించారు. ఇప్పుడు అసోం పరిణామాలలోనూ అటువంటి వైఖరే వ్యక్తమవుతోంది. అస్సామీ భాషా సంస్కృతులను సంరక్షించేందుకు రాజకీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలలో భాగమే ఆ పరిణామాలు. మరి ఆ వివాదాస్పద వీడియో వ్యవహారంపై బీజేపీ జాతీయ నాయకత్వం మౌనం వహించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అంతర్జాతీయంగా మద్దతు పొందేందుకు 'సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్' అనే నినాదం ఉపయోగపడవచ్చుగానీ ఎన్నికలు జరగనున్న అసోంలో రాజకీయ లబ్ధిని సమకూర్చుకునేందుకే మతతత్వ భావోద్రేకాలను రెచ్చగొట్టడం అనివార్యమవుతోంది. కనుకనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అసోంను సందర్శించిన ప్రతిసారీ 'అక్రమ చొరబాటుదారుల' గురించి ఆ రాష్ట్ర ప్రజలను హెచ్చరిస్తూ ఉంటారు. అంతర్జాతీయ సరిహద్దుల వద్ద కాపలా ఉండేది కేంద్ర బలగాలే అన్న వాస్తవాన్ని బీజేపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తారు. లౌకికవాద రాజకీయ నాయకులు సైతం మెజారిటీవాద రాజకీయాల ప్రాబల్యానికి తలొగ్గక తప్పలేదు.

## సింథటిక్ పామాయిల్‌తో ఆధ్యాత్మిక దాడి!



దేశవ్యాప్తంగా కోట్లాది హిందువుల విశ్వాసానికి చిహ్నమైన తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బతీస్తూ భక్తుల నమ్మకాలపై, వైసీపీ పాలనలో వ్యవస్థీకృతంగా దాడి చేశారు. ఆ దోపిడీ విలువ రూ.250 కోట్లు అని సీబీఐ తేల్చింది. ఇది కేవలం ఆర్థిక అవినీతి మాత్రమే కాదు, లడ్డూపై ఆధ్యాత్మిక దాడి. భక్తులు శ్రీవారి ఆశీర్వాదంగా భావించే లడ్డూలో స్వచ్ఛమైన ఆవు నెయ్యి స్థానంలో పామాయిల్, పారిశ్రామిక రసాయన మిశ్రమాలతో భక్తులను వంచించారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై ఈ దాడులు ఏమరుపాటున జరిగినవి కావు. నాలుగు సంవత్సరాల పాటు అప్పటి దేవస్థానం ఈవో, చైర్మన్లకు పూర్తిగా తెలిసే జరిగాయి. జూన్ 2024లో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లడ్డూ నాణ్యతపై గత నాలుగేళ్లుగా పేరుకుపోయిన ఫిర్యాదులను పరిష్కరించడానికి గుజరాత్‌లోని ఆనంద్ లో ఉన్న నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్డీడీబీ) ద్వారా పరీక్షలను నిర్వహించాలని ఆదేశించింది. సేకరించిన నమూనాల ఆధారంగా ఎన్డీడీబీ- సీఏఎల్ఎఫ్ లేబొరేటరీ ఇచ్చిన నివేదిక దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతిని కలిగించింది. స్వచ్ఛతకు కీలక ప్రమాణమైన 'ఎస్-వాల్యూస్'లో భారీ వ్యత్యాసాలు వచ్చాయి. స్వచ్ఛమైన పాల కొవ్వులో ఈ 'ఎస్' విలువ 98.05 నుంచి 104.32 పరిధిలో ఉండాలి, అయితే ఎన్డీడీబీకి టీటీడీ పంపించిన నమూనాలలో ఇది 19.72గా మాత్రమే ఉంది. ఎన్డీడీబీ విశ్లేషణలో, పాలలో ఉండే కొవ్వు కాకుండా, ఇతర కొవ్వు పదార్థాలు కలిశాయని, నెయ్యిలో జంతువుల కొవ్వు అంటే బీఫ్ టాలో (ఎద్దు కొవ్వు), లార్డ్ (పంది కొవ్వు), చేప నూనెతో పాటు సోయాబీన్, సన్‌ఫ్లవర్, పత్తి గింజల నూనె వంటి కూరగాయల నూనెలు ఉండవచ్చని ప్రాథమికంగా సూచించింది. దేశవ్యాప్తంగా వచ్చిన నిరసనలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సెప్టెంబర్ 2024లో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేశారు. దీనిపై వైసీపీ హయాంలో టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టుకు వెళ్లారు. కోర్టు కూడా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బలపరుస్తూ, ఆంధ్రప్రదేశ్ పోలీసులతో పాటుగా, సీబీఐ అధికారులతో కూడిన స్వతంత్ర విచారణకు ఆదేశించింది. ఈ సిట్ విచారణ ప్రారంభంలోనే అసలు నాలుగేళ్ల పాటు లడ్డూ తయారీలో వాడింది నెయ్యే కాదు, 'నెయ్యి' అనే పామాయిల్ కాక్టెయిల్ కెమికల్ మిశ్రమం అనే దిగ్భ్రాంతి కరమైన వాస్తవం బయటపడింది. సిట్ తన విచారణలో భాగంగా తిరిగి మరోసారి గుజరాత్ ఎన్డీడీబీతో పాటు హర్యానాకు చెందిన ఐసీఏఆర్-ఎన్డీఆర్ఐకి కూడా నెయ్యి శాంపిల్స్ పంపించి పరిశోధన చేయించింది. దీంతో ఆధ్యాత్మిక అరాచకాలన్నీ బయట పడ్డాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన బోర్డు కనుసన్నలలోనే ఉత్తర భారతానికి చెందిన కంపెనీలకు కాంట్రాక్ట్ ఇచ్చి దేవస్థానం కొనుగోలు చేసిన నెయ్యి, అసలు నెయ్యే కాదని, అది రసాయనికంగా రూపొందించిన ఒక సింథటిక్ ఉత్పత్తి అని సిట్ నిర్ధారించింది. ఆవు నెయ్యి లక్షణాలను అనుకరించడానికి సరఫరాదారులు నెయ్యికి సహజంగా ఉండే మెరిసే రంగును అద్దడానికి బీటా-కెరోటిన్ అనే కెమికల్‌ను, నెయ్యి స్వచ్ఛత పరీక్షలలో పట్టుబడకుండా తప్పించుకోవడానికి ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్స్ అనే రసాయనాన్ని, కొవ్వు లాగా చూపించడానికి కొరియా దేశం నుంచి దిగుమతి చేసుకున్న మోనోగ్లిజరైడ్లను వాడారు. ఇంకా లాక్టిక్ యాసిడ్, శానిటేషన్ కెమికల్స్‌లో వాడే లంగర్ అనే యాసిడ్ తదితరాలను వాడి, అది నెయ్యి అని భ్రమింపజేశారు. సిట్ తన దర్యాప్తులో భాగంగా రెండు సంస్థల ప్రయోగశాలల నుంచి పొందిన నివేదికల ప్రకారం- అప్పటికే ఒకసారి పరీక్ష చేసి జంతు కొవ్వు ఉన్నదని చెప్పిన ఎన్డీడీబీ-కాఫ్ ల్యాబ్ తన రెండో నివేదికలో- ఆ నెయ్యి, పామాయిల్, పామ్ స్టియరిన్, పామ్ కెర్నల్ నూనెల మిశ్రమమని, అందులో పాల కొవ్వు దాదాపు లేదని సూచించింది. అయితే కొలెస్ట్రాల్ లేకపోవడం వల్ల జంతువుల కొవ్వు ఉండే అవకాశం 'చాలా తక్కువ' అని, మోనోగ్లిజరైడ్లలో పది శాతం కంటే తక్కువ ఉన్న జంతువుల కొవ్వును లెక్కించడం సాధ్యం కాదని పేర్కొంది. ఐసీఏఆర్-ఎన్డీఆర్ఐ మాత్రం జంతువుల కొవ్వును పరీక్షించడానికి పీసీఆర్- ఆధారిత పద్ధతిని ఉపయోగించామని, పరీక్షించిన నాలుగు నమూనాలలో లార్డ్ (పంది కొవ్వు) కనిపించలేదని నివేదించింది. అయితే, ఇటువంటి విశ్లేషణ చేయడం తమకు ఇదే మొదటిసారి అని ఎన్డీఆర్ఐ తన నివేదికలో ఒప్పుకుంది. అంతే కాకుండా, రెండు సంస్థలు కూడా కనుగొన్న మోనోగ్లిజరైడ్లు మొక్కల కొవ్వు నుంచి వచ్చాయా లేదా జంతువుల నుంచి వచ్చాయా అనే విషయాన్ని సిట్ పేర్కొనలేదు. పామాయిల్ కెమికల్ మిశ్రమాలను నెయ్యి బదులు వాడడం, ఏదో ప్రమాదవశాత్తు జరిగింది కాదని, సరఫరాదారులను మార్చి, ఉద్దేశపూర్వకంగా లడ్డూ నాణ్యతను నీరుగార్చారని సిట్ వెల్లడించింది. లడ్డూల నాణ్యత మీద భక్తుల ఫిర్యాదులు ఎక్కువైపోగా 2022 మే నెలలో, సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, మైసూర్‌కు నెయ్యి నమూనాలను పంపింది. ఆ సంస్థ పరీక్షించి ఆ నెయ్యిలో పాలకు సంబంధించి కాకుండా ఇంకేవో కొవ్వు పదార్థాలు కనుగొన్నామని, కూరగాయల నూనె కల్తీకి కొండ గుర్తు అయిన 'బీటా-సిటోస్టెరోల్' ఉండటాన్ని గుర్తించామని, హానికరమైన పదార్థాలు మిశ్రమంగా ఉన్నాయని తొలి నివేదిక ఇచ్చింది. అయినా ఉన్నతాధికారులు, బోర్డు సభ్యులు పట్టించుకోకుండా ఆ కంపెనీలకే అదనపు సరఫరా ఆర్డర్లు కొనసాగించారు. తిరుమల పవిత్రతను పునరుద్ధరించే పోరాటం ఇప్పుడు కేవలం పరిపాలనాపరమైన విషయం మాత్రమే కాదు, అది ఒక ఆధ్యాత్మిక పునరుద్ధరణ మిషన్.

# 'రైస్ పేపర్'ను చుట్టేస్తున్నారు!



బియ్యంతో చేసే అప్పడాలు మనకు తెలుసు.. పల్చటి కాగితాన్ని తలపించే పూత రేకులూ తెలుసు. అయితే 'రైస్ పేపర్' సరికొత్త ట్రెండ్. సమోసా, టాకో, ఫ్రాంకీలనూ కూడా వీటిలో చుట్టేస్తున్నారు. ఇంకా మోమోలు, ప్యాన్‌కేక్‌లూ, డెజర్ట్‌లూ, ఫ్లాట్ నూడుల్సూ ... లిస్టు పెరుగుతోంది. అసలు ఏమిటీ 'రైస్ పేపర్'? మునుపెన్నడూ లేనంతగా ప్రజల్లో నేడు ఆరోగ్య స్పృహ బాగా పెరిగింది. ఏం తిన్నా ఆరోగ్యకరంగానే ఉందా? అని ఒకటికి పది సార్లు ఆలోచిస్తున్నారు. అంతేనా... నగరాల్లో అయితే తక్కువ క్యాలరీలు, జీరో ఫ్యాట్‌గా ఉండాలని కోరుకుంటున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పాకశాస్త్ర నిపుణులు ఎప్పటికప్పుడు సరికొత్త ప్రయోగాలు చేస్తున్నారు. ఆ ప్రయోగాల ఫలితమే 'రైస్ పేపర్' (బియ్యపు కాగితం). ఇది చూడటానికి అచ్చంగా మన పూత రేకులా పలుచగా, పారదర్శకంగా ఉంటుంది. తింటే... అట్టులా మెత్తగా, రుచిగా అనిపిస్తుంది. ఎలాంటి ఆహారపదార్థాలతోనైనా ఇట్టే కలిసిపోతుంది. అందుకే ఎక్కువగా ఆహార పదార్థాల ర్యాపింగ్ కోసం 'రైస్ పేపర్'ను వినియోగిస్తున్నారు. పారదర్శకంగా, లోపలి పదార్థాలు కనిపిస్తాయి కాబట్టి అలంకరణగా కూడా వాడుతున్నారు.

### ఇందులో ఏముంది?

రైస్ పేపర్... వినడానికి కొత్తగానే ఉంటుంది. కానీ బియ్యంతో అప్పడాలు చేయడం మనకు తెలిసిన విద్యే. అలాగే గోదావరి జిల్లాల్లో ఎక్కువగా చేసే పూతరేకుల్లోని రేకులు చక్కెర, బియ్యపుపిండితో చేసినట్టు... రైస్ పేపర్‌ను బియ్యంతో చేస్తారు. రాత్రంతా నానబెట్టిన బియ్యాన్ని రుబ్బుకుని, దానికి కాస్త ఉప్పు వేస్తారు. ఆ రుబ్బును గంజి బట్ట కట్టిన ఇడ్లీ పాత్రమీద పలుచని, గుండ్రటి దోశలా వేసి ఆవిరిపై ఉడికించి బియ్యం కాగితాలను తయారుచేస్తారు. వీటిని ఎండలో ఆరబెట్టి, డబ్బాల్లో వేసి పెడతారు. అవసరమైనప్పుడు తీసి నీళ్లలో కాసేపు నానబెట్టి బయటికి తీస్తే... తిరిగి మెత్తగా మారి ర్యాపర్‌గా వాడుకోవడానికి అనువుగా మారుతుంది. ఆగ్నేయాసియా దేశాల్లో ప్రతి ఇంట్లో ఇలా బియ్యం కాగితాలని చేసి పెట్టుకుంటుంటారు. వీటికి ఉన్న డిమాండ్ వల్ల అక్కడ కుటీర పరిశ్రమలా పెద్ద స్థాయిలో యంత్రాల మీద కూడా తయారుచేస్తున్నారు. కొన్నిచోట్ల వరి మొక్క ఆకులతో కూడా ఈ బియ్యం కాగితాల్ని తయారుచేస్తున్నారు. ఇందుకోసం జనపనార, మల్బరీ తదితర ఆకుల్ని కూడా వాడుతున్నారు.



### అనేక రుచుల్లో...

ప్రస్తుతం ఆన్‌లైన్‌లోనే కాకుండా, మహానగరాల్లోని పెద్ద పెద్ద సూపర్ మార్కెట్లలో 'రైస్ పేపర్' షీట్లను ప్యాకెట్లలో అమ్ముతున్నారు. వీటిని కీరా, క్యారెట్, బ్రకోలీ లాంటి తాజా కూరగాయలు చుట్టడానికి, స్ప్రింగ్ రోల్స్‌లోనూ వినియోగిస్తున్నారు. చేప, మాంసాలనూ ఉడికించడానికి వాడుతున్నారు. డంప్లింగ్స్, సమోసాలు, పానీపూరీ, టాకోలలో మైదాకు బదులుగా రైస్ పేపర్లనే వాడడం విశేషం. శాండ్విచ్‌లు, బ్రిటోలలో కూడా బియ్యం కాగితాలనే ఉపయోగించడం మొదలైంది. ప్రసిద్ధ జపనీస్ వంటకం షుషిల్లో ర్యాపర్లగా రైస్ పేపర్లనే వినియోగిస్తూ పాకశాస్త్ర నిపుణులు చక్కటి ఆరోగ్యానికి సరికొత్త రుచుల దారులు వేస్తున్నారు.

### అతిగా తినొద్దు...

ఇటీవల కాలంలో సోషల్ మీడియాలోని కుకింగ్ షోలలో బియ్యం కాగితాలను వాడుతూ వీటిని ట్రెండీగా మారుస్తున్నారు ఇన్‌ఫ్లుయెన్సర్లు. తేలికగా, పారదర్శకంగా ఉండడంతో అన్నింట్లోనూ వీటి వినియోగం పెరిగింది. ప్రస్తుతం రైస్ పేపర్లు అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు అన్ని దేశాల ఆహార పదార్థాల్లో కలిసిపోయాయి. అయితే పోషకాహార నిపుణులు మాత్రం అతి వినియోగం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. రైస్ పేపర్లలో ప్రధాన పదార్థం తెల్ల బియ్యం. సువాసన కోసం కొందరు బాస్మతీ, జాస్మిన్ రైస్‌లతో కూడా వీటిని తయారుచేస్తున్నారు. ఒకరకంగా ఎక్కువగా పాలిష్ చేసిన బియ్యంలో విటమిన్లు, మినరల్స్, పీచుపదార్థాలు తక్కువే. కాబట్టి ఇది పూర్తి ఆరోగ్యకరం అని భావించలేమన్నది న్యూట్రిషనిస్టుల అభిప్రాయం. అయినప్పటికీ రైస్ పేపర్‌తో ఆహార పదార్థాలను క్యారీ చేయడం సులభం... పైగా రుచి కూడా బాగుంటుంది కాబట్టి ఈ ట్రెండ్ అన్ని దేశాల్లోనూ కొనసాగుతోంది. మైదా, గోధుమతో చేసే రొట్టెలకు బదులుగా వివిధ ర్యాపర్ల కోసం రైస్‌పేపర్‌గా చుట్టేస్తున్నారు. కొత్త రుచులను ఎంచక్కా ఆస్వాదిస్తున్నారు.

### అక్కడ 'బాన్ ట్రాంగ్'

ఆగ్నేయాసియా ప్రాంతం నుంచే 'రైస్ పేపర్' ప్రయాణం మొదలైంది. చాలా తేలికగా, పారదర్శకంగా ఉండడంతో ప్రాచీన చైనా, జపాన్‌లలో ఈ తరహా కాగితాన్ని మొదట్లో... ఎక్కువగా సమాచారాన్ని తెలిపేందుకు, చిత్రలేఖనానికి ఉపయోగించేవారట. వియత్నాం, థాయిలాండ్, కాంబోడియా, లావోస్ తదితర దేశాల వంటలలో రైస్ పేపర్‌ను ఉపయోగించడం ఎప్పటి నుంచో ఉంది. ముఖ్యంగా వియత్నాంలో దీన్ని ఎక్కువగా తయారుచేస్తారు, వాడతారు. రైస్‌పేపర్‌ను అక్కడ 'బాన్ ట్రాంగ్'గా వ్యవహరిస్తారు. అనేక రకాల రైస్ పేపర్లను ఈ దేశంలో చూడవచ్చు. కొన్నిసార్లు దళసరిగా, ఆకారంలో కూడా తేడాలు ఉంటాయి. మొదట బియ్యాన్ని రాత్రంతా నానబెట్టి, ఉదయం నీళ్లు పోసి గ్రైండర్‌లో వేసి పిండిగా చేస్తారు. తర్వాత కాస్త నీళు, ఉప్పును కలిపి జారుడు పిండిగా చేసుకుంటారు. వేడి ఇనుప ప్లేట్లు, ఆవిరి బుట్టలపై ఈ పిండిని పలుచగా వేసి వేడిచేస్తారు. పిండి కాగితంలా పైకి లేస్తుంది. పెద్ద స్థాయిలో చేయడానికి రోలింగ్ మెషీన్లనూ వినియోగిస్తున్నారు. వియత్నాంలో పిండిలో నల్ల, తెల్ల నువ్వులు, కారం పొడి, కొబ్బరి పాలు, అరటి పండు గుజ్జులను కలిపి రైస్‌పేపర్ ఫ్లేవర్ మారుస్తూ కొత్త రుచులను అందిస్తున్నారు.

### రుచించే అంశాలివి...

– కార్బోహైడేట్లు ఎక్కువ: బియ్యంతో చేస్తారు కాబట్టి 'రైస్ పేపర్'లో మంచి పోషకాలను ఇచ్చే కార్బోహైడ్రేట్లు ఉంటాయి. రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే తక్షణ శక్తిని పొందొచ్చు.

– తక్కువ కొవ్వు, క్యాలరీలు: మిగతా స్నాక్స్‌తో పోలిస్తే 'రైస్ పేపర్'తో చేసిన స్నాక్స్‌లో కొవ్వు పదార్థాలు, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. బరువు నియంత్రణలో ఉన్నవాళ్లకి ఇది బెస్ట్ ఛాయిస్.

– గ్లుటెన్ ఫ్రీ: రైస్‌పేపర్‌లో గ్లుటెన్ ఉండదు. కాబట్టి 'గ్లుటెన్ ఇన్‌టాలరెన్స్' ఉన్నవారికి రైస్ పేపర్‌తో ర్యాప్ చేసిన పదార్థాలు మేలు చేస్తాయి.

– ప్రిజర్వేటివ్స్ లేవు: బియ్యం, ఉప్పు, నీళ్లు తప్పిస్తే ఈ పేపర్ తయారీలో వేరే ఏదీ వాడరు. నిల్వ ఉంచేందుకు ప్రిజర్వేటివ్స్ కూడా ఉపయోగించరు.

– ఫైబర్ అధికం: జీర్ణవ్యవస్థ సజావుగా జరిగేందుకు పీచుపదార్థాలు ఎంతో అవసరం. బియ్యం కాగితాలలో తగినంత పీచు పదార్థం ఉంటుంది. కాబట్టి మలబద్ధకం ఉన్న వాళ్లకి ఇవి మేలు చేస్తాయి.

– చక్కెర నియంత్రణ: రైస్ పేపర్లలోని మేలు రకం కార్బోహైడ్రేట్ల వల్ల రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది. అందుకే మధుమేహం ఉన్నవారు కూడా తినొచ్చు.

– అన్నింటికీ అనుకూలం: కూరగాయలు, చేపలు, మాంసం, స్వీట్... ఇలా వేటినైనా సులభంగా రైస్ పేపర్లలో ర్యాప్ చేయవచ్చు. ఆయా ఆహారాల పోషక విలువలను పెంచుకోవచ్చు.

– వీగన్ ఫ్రెండ్లీ: ఇవి పూర్తిగా బియ్యంతో చేసినవి కాబట్టి శాకాహారులు మరో ఆలోచన లేకుండా తినొచ్చు.

# బూరెల్ని అమృతరసాల పద్ధతిలో చేస్తుంటే



కొన్ని వంటకాల్లో సూక్ష్మాలుంటాయి. వాటిని మనం పట్టించుకోం. హడావిడిగా వండటం హడావిడిగా తినటం అనే అలవాట్ల వలన ఆహారంలో స్వారస్యాన్ని కూడా మనం పొంద లేకపోతున్నాం. బూరెలు మనందరికీ తెలిసిన వంటకమే! వాటిని ఇప్పుడు చెప్పబోయే అమృతరసాల పద్ధతిలో వండుకుంటే ఎంతో ఆరోగ్యదాయకంగా ఉంటాయి. కానీ, అరిసెల్ని, బూరెల్ని ఎంత ఇష్టం ఉన్నా ఆర్నెల్ల క్రితం రోగాలను బయట పెడతాయని చాలామంది తినటానికి భయపడతారు. అలా భయపడకుండా తినాలంటే తప్పనిసరిగా బూరెల్ని అమృతరసాల పద్ధతిలోనే వండుకోవాలి. క్షేమకుతూహలం అనే పాకశాస్త్ర గ్రంథం అమృతరసాలు వండే పద్ధతిని వివరించింది. ఈ పద్ధతిలో వండుకుంటే బూరెలు ఎంత ఆరోగ్యదాయకంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. అవి ఆరోగ్యదాయకంగా ఉండేలా చేసే అందులోని సూక్ష్మాలను పరిశీలిద్దాం: షష్టిక ధాన్యం అంటే ఆరు నెలలకు కోతకు వచ్చే బియ్యం. చాలా సారవంతమైనవి. ఈ ధాన్యాన్ని నానబెట్టి అరిశలపిండి లాగా దంచుకొని సిద్ధంగా ఉంచుకోవాలి. అవి లేనప్పుడు నాణ్యమైన బియ్యాన్ని బూరెల తయారీకి ఉపయోగించాలి. ఈ బియ్యప్పిండి 3 కప్పులైతే ఒక కప్పు చక్కెరని నీటితో కరిగించి, కొద్దిగా పెరుగు కూడా తీసుకుని వీటితో బియ్యప్పిండిని ముద్దలాగా కలపాలి. ఈ ముద్దని భుజబలం ఉపయోగించి చేతులతో బాగా మర్దించాలి. 'మర్దనం గుణవర్ధనం' అని ఆయుర్వేద సూక్తి. ఈ పిండిని ఎంత మర్దిస్తే అంత గుల్లబారుతుంది. దీన్ని బేసిన్లో ఉంచి మూతపెట్టి ఒక రాత్రంతా నిలవుంచాలి. అందువలన పెరుగులో ఉండే మంచి బ్యాక్టీరియా ఈ పిండిని పులవబెట్టి మృదుత్వాన్ని తెస్తుంది. మర్నాడు ఈ పిండిలో నువ్వుపప్పు కలిపి మళ్లీ ఒకసారి మర్దించాలి. ఈ మర్దించిన పిండిని ఉండలుగా చేసుకుని గుండ్రంగానూ మందంగానూ వత్తి నేతిలో బూరెలుగా వండుకోవాలి. ఇలా వండిన బూరెలు ఎలాంటి జబ్బా చేయకుండా ఉంటాయి. ముఖ్యంగా వాతాన్ని వేడినీ తగ్గిస్తాయి. అమిత బలకరం. పెరుగులో కనీసం 12 గంటలకు పైగా పిండిని నానించి నందువలన జీర్ణశక్తిని పెంచే గుణం ఏర్పడుతుంది. అన్నహితవు కలిగిస్తుంది. ఆకలిని పెంచుతుంది. బూరెల్లాగా పొంగుతాయి కాబట్టి, ఇవి బూరెలు. తరువాత వచ్చిన పూరీలు కూడా ఇలానే పొంగుతాయి. పూరీ శబ్దానికి కూడా మూలం బూరే! మామూలుగా మన ఇళ్ళలో వండేబూరెలకీ, ఈ అమృతరసాల పద్ధతిలో వండే బూరెలకీ అసలు తేడా పెరుగులో ఒక పూటంతా నానబెట్టడంలో ఉంది. ఇలా చెయ్యక పోవటాన మామూలు బూరెలు అజీర్తి చేసేవిగా, పొట్టని చెడగొట్టేవిగా ఉంటున్నాయి. అమృతరసాలు జలేబీలకు పూర్వరూపాలు. వాటి తయారీలో దక్షిణాదివారి పాత్ర తప్పకుండా ఉంది. జలేబీల తయారీలోనూ ఇదే పద్ధతిని అనుసరిస్తారు. కాకపోతే, పిండిని కొంచెం పలచగా చేసి చుట్టలుగా వత్తి పంచదార లేదా బెల్లం పాకంలో నానిస్తారు.

బియ్యప్పిండితో మనవాళ్లు చేసిన ప్రయోగాలు అద్భుతమైనవి. ఇప్పుడంటే అన్ని వంటకాలనీ మైదాపిండితో వండటం మొదలు పెట్టి మన ఆహార సంస్కృతిని కలుషితం చేసుకుంటున్నాం గానీ, ఈ మైదాపిండి వందేళ్లక్రితం అందుబాటులోకి వచ్చేవరకూ మన పూర్వులు ఎక్కువగా బియ్యప్పిండినీ, అప్పుడప్పుడూ గోధుమపిండినీ ఉపయోగించి స్వీట్లూ హాట్లూ వండుకునేవాళ్లు. జలేబీల్ని కూడా బియ్యప్పిండితోనే చేసేవారనటానికి సాక్ష్యం ఈ అమృతరసాలే! ఏఏ ప్రాంతాల్లో ఏవి ఎక్కువగా పండుతాయో వాటితో ఆ ప్రాంతాల్లో ఎక్కువ వంటకాలు, వాటి మీద ప్రయోగాలూ జరుగుతాయి. వండగా వండగా వాటిలో ప్రావీణ్యత సిద్ధిస్తుంది.

### ఉల్లి సమోసా

కావలసిన పదార్థాలు: మైదా లేదా గోధుమ పిండి – రెండు కప్పులు, ఉల్లి ముక్కలు – కప్పు, పసుపు – అర స్పూను, ధనియాల పొడి – అర స్పూను, కారం – స్పూను, పచ్చి మిర్చి ముక్కలు – స్పూను, ఉప్పు, నీళ్లు, నూనె – తగినంత.

**తయారుచేసే విధానం:**
మైదాను ఓ గిన్నెలోకి తీసుకుని కాస్త ఉప్పు, రెండు స్పూన్ల వేడి నూనె వేసి కలపాలి. మధ్య మధ్యలో కాస్త నీళ్లను కలుపుతూ పిండిలా చేసుకుని మూత పెట్టి పావు గంట సేపు పక్కన పెట్టుకోవాలి. ఓ గిన్నెలోకి ఉల్లి ముక్కలు, పసుపు, ధనియాల పొడి, మిర్చి ముక్కలు వేసి బాగా కలపాలి. మైదా పిండిని సరిసమానమైన ముద్దలుగా చేసుకుని దీర్ఘచతురస్రాకారంలో వత్తుకోవాలి. మూడు వైపుల కత్తిరించి మధ్యలో ఉల్లి మిశ్రమాన్ని పెట్టి, మూసేసి నూనెలో దోరగా వేయిస్తే ఉల్లి సమోసా తయారు.

### పాల పూరీ

**కావలసిన పదార్థాలు:**
గోధుమ పిండి – రెండు కప్పులు, రవ్వ – రెండు స్పూన్లు, పాలు – మూడు కప్పులు, కుంకుమ పువ్వు – పావు స్పూను, చక్కెర – పావు కప్పు, యాలకుల పొడి – పావు స్పూను, బాదం పలుకులు – రెండు స్పూన్లు, నీళ్లు, నూనె – తగినంత.

**తయారుచేసే విధానం:**
పూరీలను చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఓ వెడల్పైన మంద పాటి గిన్నెలో పాలు, కుంకుమ పువ్వును కలిపి మరిగించాలి. కాస్త చిక్కగా అయ్యాక చక్కెరను కలిపి ఇంకా మరిగించాలి. మరింత దగ్గరగా అయ్యాక యాలకుల పొడి వేసి స్టవ్ కట్టేయాలి. పూరీలను త్రిభుజాకారంలో కట్ చేసుకుని ఈ పాలలో వేసి పది నిమిషాలు నానబెట్టాలి. ఆ తరవాత బాదం పలు కులు వేసిన పాల పూరీ రుచికరంగా బాగుంటుంది.





తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి..

# వెదజల్లే పద్ధతిపైనే రైతుల మక్కువ..



**ఇబ్రహీంపట్నం**
రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించే విధంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి అన్నదాతలు అతితక్కువ పెట్టుబడులు పెట్టి అధికంగా లాభాలు గడించే విధంగా కృషిచేసింది. అందులో భాగంగానే వరిలో వెదజల్లే పద్ధతిని పలు క్లస్టర్ల పరిధిలో రైతులకు అవగాహన కల్పించింది. వెదజల్లే వరిసాగు విధానం ద్వారా అధిక దిగుబడి వచ్చినందున రైతులు ఎక్కువ శాతం ఈ విధానంపై దృష్టి సారించారు. ప్రస్తుతం అదే విధానంతో ముందుకు సాగుతున్నారు. రైతులంతా ఒకేసారి నారు పోసుకోవడంతో ఒకేసారి నారు ఎదిగి నాటుకు వస్తుంది. ఈ సమయంలో రైతులు, కూలీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అసలే రైతు కూలీల కొరత ఉందంటే.. దీన్ని అదునుగా తీసుకుని వాళ్లు తమ కూలీరేట్లను కూడా ఇష్టానుసారంగా పెంచేస్తున్నారు. దీంతో ఈ సమస్య నుంచి రైతులు బయటపడేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. వరిసాగులో నాట్లువేసే పద్ధతికి స్వస్తికి పలుకుతూ వెదజల్లే విధానంపై రైతులు దృష్టి సారించే విధంగా అవగాహన కల్పించారు. ఇప్పటికే మార్కెట్‌లోని రకరకాల నాటువేసే మిషన్లు వచ్చినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో రైతులు వాటివైపు మొగ్గుచూపలేదు. ఈ క్రమంలోనే పురాతన కాలం నాటి వెదజల్లే పద్ధతి అనుకూలంగా ఉండటంతో ప్రస్తుతం రైతులు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. గత నాలుగేళ్లుగా రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఈ పద్ధతి వెలుగులోకి వస్తుండటంతో చాలామంది రైతులు ఈ విధానంపై మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఈ వెదజల్లే పద్ధతిలో సాగువిధానం బాగా పెరిగింది.

### ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ..

సాధారణంగా ఎకరా పొలం నాటు వేయాలంటే కూలీలు రూ.3500 నుంచి రూ.4000వరకు తీసుకుంటారు. వెదజల్లితే ఎకరాకు కేవలం రూ.400 నుంచి రూ.500 ఖర్చు మాత్రమే అవుతుంది. ఇక రైతే స్వయంగా జల్లుకుంటే ఆ ఖర్చు కూడా ఉండదు. దిగుబడులు ఎకరాకు 35 నుంచి 45బస్తాల వరకు వస్తున్నాయి. ముందుగా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించి ప్రతి క్లస్టర్‌లో 50 ఎకరాల చొప్పున వెదజల్లే పద్ధతిలో సాగు చేయించారు. పలు క్లస్టర్ల పరిధిలో రైతులతో వెదజల్లే పద్ధతిలో సాగు చేయటంతో రైతులు అధిక దిగుబడి సాధించారు. దీంతో ఇతర రైతులు ఫీల్డ్ విజిట్ చేసి అధికశాతం రైతులు వెదజల్లే విధానంపై చొరవ చూపుతున్నారు.

## అంటుకట్టు సాంకేతికతతో..

# కూరగాయల అధిక దిగుబడి




హైదరాబాద్: అంటుకట్టు సాంకేతికతతో కూరగాయల అధిక దిగుబడి సాధించవచ్చని ఇక్రిశాట్ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. అధిక దిగుబడినిచ్చే వంగడాన్ని సహజమైన వెంటిలేటెడ్ పాలీహౌస్ (ఎన్‌వీపీహెచ్) సాగుతో అంటుకట్టడం వల్ల ఉత్పాదకత పెరుగడంతోపాటు ఆదాయాన్ని పెంచుకోవచ్చని నిరూపితమైంది. ఫ్రాంటియర్స్ ఇన్ అగ్రోనమీలో ఈ పరిశోధన కథనాన్ని ప్రచురించారు. పాలీహౌస్ వాతావరణ పరిస్థితులలో పెరిగిన అంటుకట్టిన టమోటా మొక్కలపై (సోలనమ్ టోర్వమ్ రూట్‌స్టాక్‌పై సియోన్) దృష్టి సారించారు. బహిరంగ క్షేత్రాల్లో అంటుకట్టని మొక్కలతో వాటిని పోల్చారు. దీంతో ఎన్‌వీపీహెచ్ పద్ధతితో అంటుకట్టిన టమోటాలు 63.8 శాతం ఎక్కువ దిగుబడి వచ్చింది. అలాగే 3 నుంచి 5 వరకు అదనపు పంటలు ఇచ్చింది. కాగా, వంకాయ, మిరపకాయ, దోసకాయ, పుచ్చకాయలు వంటి ఇతర కూరగాయలు, పండ్ల మొక్కలపై కూడా ఈ సాంకేతికతో ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యాలతో కలిసి రైతులకు శిక్షణ ఇస్తున్నారు. అధిక దిగుబడులతో రైతుల జీవితాలు మారడంతోపాటు పోషకాహారం, జీవనోపాధి, ఆహార స్థిరత్వాన్ని మెరుగుపరుస్తుందని ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు. కూరగాయల అంటుకట్టు పద్ధతి చిన్న రైతులకు గేమ్ ఛేంజర్ అని ఇక్రిశాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (రీసెర్చ్, ఇన్నోవేషన్) డాక్టర్ స్టాన్‌ఫోర్డ్ బ్లేడ్ తెలిపారు. ఈ విధానం ద్వారా దిగుబడితోపాటు లాభాలను పెంచడమే కాకుండా, వ్యవస్థ స్థితిస్థాపకతకు ఉపయోగపడుతుందని తమ పరిశోధనలో తేలిందని చెప్పారు. వాతావరణ వైవిధ్యాన్ని ఎదుర్కొంటున్న ప్రాంతాలలోనూ కూరగాయల పెంపకంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి అంటుకట్టు పద్ధతి ఎలా సహాయపడుతుందో తమ అధ్యయనం స్పష్టం చేసిందని ఇక్రిశాట్ రెసిలెంట్ ఫార్మ్ అండ్ ఫుడ్ సిస్టమ్స్, తాత్కాలిక డైరెక్టర్ డాక్టర్ రమేష్ సింగ్ తెలిపారు. ప్రారంభంలో టమోటాలపై దృష్టి సారించినప్పటికీ, అభివృద్ధి చేసిన అంటుకట్టు పద్ధతిని వంకాయ, మిరప, దోసకాయ, పొట్లకాయ, పుచ్చకాయలతో సహా విస్తృత శ్రేణి కూరగాయల పంటలకు అన్వయించవచ్చని ఈ వినూత్న పరిశోధనకు కారణమైన ఇక్రిశాట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రోహన్ ఖోపడే వివరించారు. మరోవైపు విభిన్న వ్యవసాయ వ్యవస్థలలో ఉత్పాదకతను పెంచే సామర్థ్యాన్ని ఈ సాంకేతికత అన్వయిస్తుందని ఇక్రిశాట్ వ్యవసాయ రంగంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గజనన్ సావర్గాంకర్ తెలిపారు. ప్రభుత్వ సహకారంతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్ రైతులకు గణనీయమైన ప్రయోజనాలు అందించిందని, కూరగాయల ఉత్పాదకత 30 శాతం నుంచి 150 శాతం వరకు పెరిగిందని వివరించారు.



# ఊహకు అందని మాయాజాలం

సీనియర్ కథానాయిక అనుష్కశెట్టి మలయాళంలో నటిస్తున్న తొలి చిత్రం 'కథనార్'. డార్క్ ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి రొజిన్ థామస్ దర్శకత్వం వహిస్తున్నారు. గోకులం గోపాలన్ నిర్మాత. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆద్యంతం ఫాంటసీ అంశాలతో విజువల్ ఎఫెక్ట్స్‌ను హైలైట్ చేస్తూ ట్రైలర్ ఆకట్టుకుంది. అతీంద్రియ శక్తులు ఉన్నాయని నమ్మే కడమట్టత్తు కథనార్ అనే పూజారి గాథల స్ఫూర్తితో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పురాణాలు, మాయా ప్రపంచం కలబోతగా ఓ ఫాంటసీ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ట్రైలర్ సాగింది. 'ఎవరి ఊహకి అందని.. అందరూ ఆశ్చర్యంతో చూసే ఓ మాయాజాలం' అనే డైలాగ్ సినిమా కథా సారాన్ని తెలియజేసేలా ఉంది. జయసూర్య, ప్రభుదేవా, సనూప్‌సాన్, శాండీ, దేవిక, నితీష్ భరద్వాజ్, వినీత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రాహుల్ సుబ్రహ్మణ్యన్, దర్శకత్వం: రోజిన్ థామస్.

# బుల్లెట్ ఎక్కి ఊరంత తిరిగేవాడిని!



ఓ జనరేషన్ ప్రేక్షకులకు చాలా ఇష్టమైన హీరో డా.రాజశేఖర్. ఆయన సినిమాను సగటు ప్రేక్షకుడితోపాటు అందరు హీరోల అభిమానులూ అభిమానించేవారు. 'యాంగ్రీ యంగ్‌మ్యాన్' అంటూ ఆయన్ని ఇష్టంగా పిలుచుకునేవారు. తలంబ్రాలు, ఆహుతి, అంకుశం, మగాడు, మమతల కోవెల, అల్లరి ప్రియుడు, అన్న, శివయ్య.. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ విలక్షణ నటుడి కెరీర్‌లో ఎన్నో అద్భుతాలు. కెరీర్ పరంగా కాస్తంత గ్యాప్ తీసుకున్న రాజశేఖర్... 'బైకర్' సినిమాతో సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. కథానాయకుడు శర్వానంద్ తండ్రిగా ఇందులో కీలకమైన పాత్రను పోషించారాయన. యూవీ క్రియేషన్స్ నిర్మాణంలో అభిలాష్ రెడ్డి తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో ప్రత్యేకంగా మాట్లాడారు డా.రాజశేఖర్. నేను కష్టపడి, ఇష్టంతో చేసిన సినిమా 'బైకర్'. అందుకే ఈ సినిమా ఫలితం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఈ కథ విన్నప్పుడు నా పాత్రతో పాటు కథ కూడా చాలాబాగా నచ్చింది. అనుకున్నట్టే దర్శకుడు అభిలాష్‌రెడ్డి చాలా బ్రిలియంట్‌గా సినిమాను తీర్చిదిద్దారు. ముఖ్యంగా నా క్యారెక్టర్ మీద ఆయన స్పెషల్ కేర్ తీసుకున్నారు. అనుకున్నది వచ్చేంతవరకూ తను రాజీపడలేదు. ఆయన విజన్ వల్లే ఈ సినిమా ఇంతబాగా వచ్చింది. ఈ సినిమాలో ఫాదర్ అండ్ సన్ ఎమోషన్ అద్భుతంగా ఉంటుంది. అలాగే రేసింగ్ సీన్స్ హాలీవుడ్ సినిమాల రేంజ్‌లో ఉంటాయి. శర్వానంద్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభవం. తను బెస్ట్ కొలీగ్. ఓ ఫ్రెండ్స్‌లా ఇద్దరం పనిచేశాం. యూవీ క్రియేషన్స్ వారిది రాయల్ ట్రీట్‌మెంట్. అసలు రాజీ అనే పదం వారికి తెలియదు. హాలీవుడ్ క్వాలిటీతో ఈ సినిమా నిర్మించారు. నాకు చిన్నప్పట్నుంచీ బైక్స్ అంటే ఇష్టం. మా అమ్మమ్మగారింట్లో బుల్లెట్ ఉంటేది. సెలవుల్లో అక్కడికి వెళ్లిన ప్రతిసారీ ఆ బుల్లెట్ ఎక్కి ఊరంతా తిరిగేవాడ్ని. నా 'శేషు' సినిమా కోసం ప్రత్యేకంగా యమహా సిక్స్ ఫిఫ్టీ బండి కొనుక్కొని వాడాను. ఆ తర్వాత కూడా అదే బైక్‌ని రోజూ నడిపేవాడ్ని. నా డ్రైవింగ్ తీరు చూసి, ప్రమాదకరంగా నడుపుతున్నానని నాకు తెలియకుండానే బైక్‌ని అమ్మేసింది జీవిత. దానికి తగ్గట్టే ఈ సినిమాలో నా పాత్ర పేరు బుల్లెట్ సునీల్. ఈ పాత్ర వివరాల మాత్రం మీరు తెరపైనే చూడాలి. పవన్ సాధినేని దర్శకత్వంలో 'మగాడు' అనే సినిమా చేస్తున్నాను. ఇంకా 20శాతం మాత్రమే బ్యాలన్స్ ఉన్న ఆ సినిమా షూటింగ్‌ని నెక్ట్స్ మంత్ పూర్తి చేస్తాను. అలాగే నా కుమార్తె శివానితో కలిసి ఓ సినిమా చేస్తున్నాను. రమ్య విశ్వదేవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టైటిల్‌ని త్వరలో ప్రకటిస్తా.



# జనం మనసులో నిలిచే సినిమా..

కిరణ్ అబ్బవరం, శ్రీగౌరిప్రియ జంటగా నటిస్తున్న భావోద్వేగ ప్రేమకథ 'చెన్నై లవ్‌స్టోరీ'. రవి నంబూరి ఈ చిత్రానికి దర్శకుడు. బ్లాక్‌బస్టర్ 'బేబీ' మేకర్స్ సాయిరాజేష్, ఎస్‌కేఎన్ నిర్మాతలు. ప్రస్తుతం నిర్మాణదశలో ఉన్న ఈ సినిమాకు మణిశర్మ సంగీత దర్శకుడు. ఈ సినిమాలో 'గుర్తుందా..' అంటూ సాగే ఓ పాటను హైదరాబాద్‌లో విడుదల చేశారు. కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ 'సాయిరాజేష్ ఈ కథ చెప్పినప్పుడే ఇది బలంగా జనం మనసుల్లో నిలిచిపోయే సినిమా అని అర్థమైంది.ముఖ్యంగా మణిశర్మ ఇచ్చిన ఏడు పాటల్నీ థియేటర్లలో సెలబ్రేట్ చేసుకుంటారు' అని నమ్మకంగా చెప్పారు. ఏదో చిన్న సినిమా చేసుకుందాం అనుకున్న తనతో ఇంతటి ఎమోషనల్ మూవీని డైరెక్ట్ చేయించిన నిర్మాతలు సాయిరాజేష్, ఎస్‌కేఎన్‌లకు కృతజ్ఞతలని దర్శకుడు రవి నంబూరి అన్నారు. తన కథను తాను అనుకున్న దానికంటే అద్భుతంగా దర్శకుడు రవి నంబూరి తెరకెక్కించాడని, తను ఎంతటి ప్రతిభావంతుడో ఈ సినిమా చెప్పబోతోందని కథారచయిత, నిర్మాత సాయిరాజేష్ అన్నారు. ఇంకా నిర్మాత ఎస్‌కేఎన్, సంగీత దర్శకుడు మణిశర్మ , నిర్మాత ధీరజ్ మొగిలినేని కూడా మాట్లాడారు.

# హిందీలో రెండో సినిమా

బాలీవుడ్ అగ్ర హీరో సల్మాన్‌ఖాన్‌తో దిల్ రాజు భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. వంశీ పైడిపల్లి దర్శకత్వం వహిస్తారు. హై ఇంటెన్సిటీ యాక్షన్ డ్రామాగా హిందీ భాషలో ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. ఈ సినిమాలో కథానాయికగా నయనతార నటించబోతున్నట్లు వార్తలొచ్చాయి. తాజాగా ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. బ్లాక్‌బస్టర్ హిట్ 'జవాన్' తర్వాత నయనతార చేస్తున్న హిందీ చిత్రమిదే కావడం విశేషం. సల్మాన్-నయనతార జోడీ ఈ ప్రాజెక్ట్‌కు మరింత హైప్‌ని తీసుకొస్తుందని మేకర్స్ అంటున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టి, వచ్చే ఏడాదిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, రచన-దర్శకత్వం: వంశీ పైడిపల్లి.

